కాంగ్రెస్, బీజేపీలతో ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం

- రిజర్వేషన్ల పెంపుపై నోరుమెదపని బీజేపీ
- విభజన హామీలు నెరవేర్చకుండా తెలంగాణకు కేంద్ర సర్కారు ద్రోహం
- ఆరు గ్యారెంటీలతో కాంగ్రెస్ మోసం
- రెండు పార్టీలకు ఓటేస్తే ఒరిగేది శూన్యం
- లోక్‌సభ నియోజకవర్గంలో టూరిజం సర్క్యూట్లు చేస్తా
- బీఆర్ఎస్ మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి మాలోత్ కవిత

మహబూబాబాద్, ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ): 'బీజేపీ, కాంగ్రెస్ పార్టీలతో ఎస్సీ, ఎస్టీలకు ఒరిగిందేలేదు.. కేవలం ఓటుబ్యాంకుగానే వాడుకుంటున్నయ్.. గిరిజనుల అభ్యున్నతి ఒక్క బీఆర్ఎస్‌తోనే సాధ్యమవుతుంది' అని బీఆర్ఎస్ మహబూబాబాద్ లోక్‌సభ అభ్యర్థి మాలోత్ కవిత తేల్చిచెప్పారు. 'ఈ ఎన్నికల్లో 400 సీట్లిస్తే రాజ్యాంగాన్ని మారుస్తామని బీజేపీ అంటున్నది. దీని వెనుక ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లలో తీవ్ర అన్యాయం చేసే కుట్ర దాగి ఉంది.' అని అనుమానం వ్యక్తం చేశారు. తండాలను పంచాయతీలుగా చేసి, రిజర్వేషన్లు 10శాతానికి పెంచిన ఘనత తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌దేనని చెప్పిన ఆమె, ఎస్సీ వర్గీకరణ బిల్లుపై బీఆర్ఎస్ ప్రభుత్వం తీర్మానం చేసి పంపితే కేంద్రంలోని బీజేపీ దానిపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని గుర్తుచేశారు. మంగళవారం ఆమె 'నమస్తే తెలంగాణ'కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ హైదరాబాద్‌లో గిరిజన, ఆదివాసీల భవన్ నిర్మించి ఆత్మగౌరవాన్ని నిలబెట్టిన వ్యక్తి కేసీఆరేనని గుర్తుచేశారు.

'మా పార్టీ గెలిస్తేనే తెలంగాణ అభివృద్ధి' అని కాంగ్రెస్, బీజేపీ అంటున్నాయి. దీనిపై మీరేమంటారు?

ఆ రెండు పార్టీలు చెప్పేవి పచ్చి అబద్ధాలు. దేవుని పేరు చెప్పి బీజేపీ ఓట్లడుగుతున్నది. హామీల అమలు కోసం కాంగ్రెస్ పార్టీ దేవుని మీద ఒట్టేస్తున్నది. మేము మాత్రం ఆ దేవున్ని, ప్రజలను నమ్ముకొని చేసిన అభివృద్ధి చూసి ఓటెయ్యాలని కోరుతున్నాం. రాష్ట్ర విభజన హామీలను బీజేపీ సర్కారు మరిచిపోయింది. మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలో ఉన్న గిరిజన యూనివర్సిటీని పదేళ్లుగా నాన్చి ఇటీవల ప్రారంభించారు. ముఖ్యంగా బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీని స్వార్థ రాజకీయాల కోసం బీజేపీ పక్కనబెట్టింది. ఉక్కు ఫ్యాక్టరీ నిర్మించాలని బీసీ అధినేత కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు ఎంపీలమంతా కేంద్రానికి చాలాసార్లు విన్నవించినా కేంద్రం పట్టించుకోలేదు. ఇక ఆరు గ్యారెంటీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, ఇప్పుడు వాటిని నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తున్నది. తెలంగాణ ధ్యాస పట్టని ఆ పార్టీలతో అభివృద్ధి ఎలా సాధ్యమో చెప్పాలి. నా నియోజకవర్గంలోని ప్రజలు కాంగ్రెస్‌ను ఎందుకు ఎన్నుకున్నామా అని బాధపడుతున్నారు. ప్రజల సమస్యలను గాలికొదిలేసి, ఇతర పార్టీల ఎమ్మెల్యేలను కొనుగోలు చేయడంలోనే సీఎం రేవంత్‌రెడ్డి బిజీగా ఉన్నాడు. క్వింటాల్ ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వకపోవడమే గాక, రుణమాఫీని గాలికి వదిలేశారు. ఇప్పుడు దేవుళ్లపై ప్రమాణం చేసి ఆగస్టు 15లోపు రుణమాఫీ చేస్తానని హామీ ఇస్తున్నారు. ఏ ఏడాది ఆగస్టు 15 అనేది ఎక్కడా చెప్పడం లేదు.

ఈ ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలుస్తామని కాంగ్రెస్ అంటున్నది కదా?

మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చి పచ్చి దగా చేసిన కాంగ్రెస్‌పై ప్రజల్లో నమ్మకం పోయింది. ఆడబిడ్డల పెళ్లికి ఇస్తామన్న తులం బంగారం ఎటుపోయింది? 18 ఏళ్లు నిండిన మహిళకు రూ.2,500 ఏవీ?, సాగు, తాగునీరు ఏది? రూ. 4వేల పింఛన్ ఎప్పుడు అమలు చేస్తారు?. కాంగ్రెస్‌కు ప్రజాబలం ఉంటే ఈ నెల 19న సీఎం రేవంత్ మానుకోటకు వచ్చిన సందర్భంలో సభకు జనం రాక గంటన్నరపాటు బస్సులో ఎందుకు వేచి ఉన్నాడు? ఇది చాలదా కాంగ్రెస్ ప్రభుత్వం మీద ప్రజల్లో వ్యతిరేకత ఉందనేందుకు!

ఎంపీగా మీరు చేసిన అభివృద్ధి ఏంటి. మీరు గెలిస్తే చేయాలనుకుంటున్న పనులేంటి?

ఐదేళ్లలో మానుకోట పార్లమెంట్ పరిధిలో భద్రాచలం, మహబూబాబాద్, నర్సంపేట, ములుగులో మెడికల్ కళాశాలలు, నర్సింగ్ కళాశాలు ఏర్పాటు చేశాం. మానుకోటకు ఇంజినీరింగ్ కాలేజీ, మల్యాల ఉద్యాన డిగ్రీ కళాశాల, మహబూబాబాద్ రైల్వేస్టేషన్ ఆధునికీకరణ కోసం పెద్ద ఎత్తున నిధులు తెచ్చా. రాయగిరి మీదుగా భద్రాచలం వరకు నేషనల్ హైవే మంజూరైంది. పార్లమెంట్ పరిధిలో నాలుగు ఏకలవ్య పాఠశాలలు నడుస్తున్నాయి. నన్ను ప్రజలు ఆదరించి గెలిపిస్తే భద్రాచలం, బయ్యారం పెద్ద చెరువు, భీముని పాదం, లక్ష్మవరం, పాకాల ప్రాంతాలను టూరిజం హబ్‌గా అభివృద్ధి చేస్తా.

ఎన్నికల ప్రచారంలో ప్రజల స్పందన ఎలా ఉంది?

గిరిజన ఆడబిడ్డగా నన్ను మానుకోట పార్లమెంట్ పరిధిలో ఎక్కడికి వెళ్లినా ప్రజలు బాగా ఆదరిస్తున్నారు. ఏగ్రామంలోనైనా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేస్తున్నారు. ఎక్కడ ప్రచారానికి వెళ్లినా రైతులు, వృద్ధులు, మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి తమ సమస్యలు చెబుతూ బాధపడుతున్నారు. మానుకోట పార్లమెంట్ పరిధి ఓటర్లకు నేనొక్కటే విజ్ఞప్తి చేస్తున్నా.. నిత్యం మీకు అందుబాటులో ఉండి మీ సమస్యలు పరిష్కరించే అభ్యర్థిని గెలిపించండి. ఓట్లు వచ్చినప్పుడే మీకు కనిపించే వారిని పక్కన పెట్టండి. కరోనా సమయంలో కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు ఏమైనా సాయం చేశారా? కనీసం బాధితులకు ధైర్యం చెప్పేందుకైనా వచ్చారా ప్రజలు ఆలోచించాలి. తెలంగాణ హక్కులు దక్కాలంటే పార్లమెంట్‌లో తప్పనిసరిగా బీఆర్ఎస్ అభ్యర్థులుండాలి. నన్ను ఆశీర్వదించి గెలిపిస్తే లోక్‌సభలో ప్రజల తరపున ప్రశ్నించే గొంతుకనవుతా.

రైతులపై కాల్పుల చరిత్ర కాంగ్రెస్‌ది

మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

వేల్పూర్, ఏప్రిల్ 23: ఎన్నికల్లో ఓట్ల కోసం సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు మాయమాటలు చెబుతున్నాడని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు. ఎర్రజొన్న బకాయిలు అడిగిన రైతులపై కాల్పులు జరిపింది కాంగ్రెస్ కాదా ? అక్రమంగా కేసులు పెట్టిన చరిత్ర మీది కాదా? అని ప్రశ్నించారు. కేసీఆర్ ప్రభుత్వం రూ.11 కోట్ల ఎర్రజొన్న బకాయిలు చెల్లించి, రైతులపై కాంగ్రెస్ సర్కారు పెట్టిన కేసులను ఎత్తేసిందని స్పష్టం చేశారు. నిజామాబాద్‌లో సోమవారం జరిగిన సభలో రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్‌పై చేసిన విమర్శలను ప్రశాంత్‌రెడ్డి తిప్పికొట్టారు. 50 ఏండ్లు అధికారంలో ఉన్నప్పుడు పసుపుబోర్డు ఇవ్వని కాంగ్రెస్.. ఎన్నికల కోసం కల్లబొల్లి మాటలు మాట్లాడటం సిగ్గుచేటని అన్నారు. పదేండ్లు అధికారంలో ఉండి పసుపుబోర్డు సాధ్యం కాదని చెప్పిన బీజేపీ కూడా.. రైతుల ఓట్ల కోసం పసుపుబోర్డు ఇచ్చామని ప్రధానమంత్రితో అబద్ధపు ప్రకటన చేయించారని విమర్శించారు. రైతులను అబద్ధాలతో మోసం చేస్తున్న కాంగ్రెస్, బీజేపీలకు రైతుల ఉసురు తగులుతుందని హెచ్చరించారు. పసుపుబోర్డు కోసం నాలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులను కలిసి వారి నుంచి లేఖలు తెప్పించి, కేంద్ర ప్రభుత్వానికి అందజేసింది అప్పటి ఎంపీ కవితా కాదా? అని ప్రశ్నించారు. షుగర్ ఫ్యాక్టరీని మూసివేసిందే కాంగ్రెస్ ప్రభుత్వమని, సెప్టెంబర్ 17న తెరిపిస్తానని సీఎం రేవంత్‌రెడ్డి మాయ మాటలు చెప్తున్నాడని విమర్శించారు. అబద్ధాల కాంగ్రెస్, బీజేపీలకు పాడికట్టి సిసలైన రైతు పక్షపాతి బీఆర్ఎస్ పార్టీకి ఓటేసి కేసీఆర్‌కు వెన్నుదన్నుగా నిలువాలని ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు.

ఏపీకి నీటి విడుదల పూర్తి

హైదరాబాద్, ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ): నాగార్జునసాగర్ రిజర్వాయర్ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు నీటి విడుదల కోటా పూర్తయినట్టు కేఆర్ఎంబీ తెలిపింది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్‌కు ఈఎన్సీకి లేఖ రాసింది. ఈ నెల 12న జరిగిన తీర్మానం ప్రకారం సాగర్ కుడి కాలువ నుంచి నాటికి 5.50 టీఎంసీల నీటిని విడుదల చేసినట్టు పేర్కొన్నది. దీంతో సోమవారమే గేట్లను మూసివేసినట్టు పేర్కొన్నది.

కరీంనగర్‌లో మాట్లాడుతున్న యాదగిరి శేఖర్‌రావు

బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్‌కు ట్రస్మా మద్దతు

ట్రస్మా ముఖ్య సలహాదారుడు యాదగిరి శేఖర్‌రావు

కార్పొరేషన్, ఏప్రిల్ 23: బీఆర్ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌కు ట్రస్మా (తెలంగాణ గుర్తింపు పొందిన పాఠశాలల యాజమానుల అసోసియేషన్) సంపూర్ణ మద్దతు ప్రకటించింది. మంగళవారం కరీంనగర్‌లోని ఓ హోటల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ట్రస్మా ముఖ్య సలహాదారుడు ఈ విషయాన్ని వెల్లడించారు. ప్రైవేట్ టీచర్ల సమస్యలపై వినోద్‌కు సంపూర్ణ అవగాహన ఉన్నదని, పార్లమెంట్‌లో తమ సమస్యలను ప్రస్తావిస్తారనే ఉద్దేశంతో మద్దతు ఇస్తున్నామని చెప్పారు. ఈ సమావేశంలో ప్రైవేటు ఉపాధ్యాయుల సంఘం నాయకులు వేణుగౌడ్, రమేశ్, రవీందర్‌రెడ్డి, మధుసూదన్, రవి, రాజుయాదవ్, భరత్, ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

గోదావరి జలాలను కొల్లగొట్టే కుట్ర

- తమిళ నాడులో బీజేపీ ఇచ్చంపల్లి రాజకీయ ప్రయోజనాలకే..
- తెలంగాణ బీజేపీ ఎంపీలు నోరెత్తరేమీ ?
- నదుల అనుసంధానాన్ని రద్దు చేయాలి
- కరీంనగర్ బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్

కరీంనగర్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బోయినపల్లి వినోద్‌కుమార్

కరీంనగర్, ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ): నదుల అనుసంధానం పేరిట తెలంగాణకు జీవనాధారమైన గోదావరి జలాలను కొల్లగొట్టేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని కరీంనగర్ బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ ధ్వజమెత్తారు. మంగళవారం కరీంనగర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నదుల అనుసంధానంపై దేశంలో ఎప్పటి నుంచో చర్చ జరుగుతున్నదని, 2014లో ఈ విషయం తెరపైకి వచ్చినప్పుడు గోదావరి, కృష్ణా నదుల్లో తెలంగాణ వాటా తేల్చాలని అప్పటి సీఎం కేసీఆర్ కేంద్రానికి లేఖ రాయడంతో మరుగునపడిన విషయాన్ని వినోద్‌కుమార్ గుర్తు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కేంద్రంలోని బీజేపీ ఈ విషయాన్ని మరోసారి తెరపైకి తెచ్చిందని అన్నారు. తమిళనాడులో రాజకీయ ప్రయోజనాలు ఆశిస్తున్న బీజేపీ తెలంగాణకు దగా చేయాలని చూస్తున్నదని మండిపడ్డారు. ఇచ్చంపల్లి ప్రాజెక్టు ఎత్తును వంద మీటర్లు పెంచాలని నిర్ణయం తీసుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఎంఓయూ కుదిరినట్టు స్పష్టం చేశారు. అందులో భాగంగానే ఈ నెల 15న కేంద్ర జలవనరుల శాఖ ఆదేశాలు కూడా ఇచ్చిందని అన్నారు. 1985లో ఉమ్మడి కరీంనగర్, వరంగల్ జిల్లాల మధ్య ఇచ్చంపల్లిలో మల్టీపర్పస్ ప్రాజెక్టు నిర్మించే ప్రయత్నాన్ని మహారాష్ట్రతోపాటు అప్పటి మధ్య ప్రదేశ్ ప్రభుత్వాలు తీవ్రంగా వ్యతిరేకించిన విషయాన్ని గుర్తు చేశారు. ఉత్తరాదిలో గంగా, మహా నదుల అనుసంధానంలేకుండా గోదావరి, కావేరీ నదులను అనుసంధానం చేయడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. నదుల అనుసంధానం కేవలం దక్షిణ భారత దేశానికే వర్తింపజేస్తారా? అని వినోద్‌కుమార్ ప్రశ్నించారు. గోదావరి బేసిన్‌లోని సమ్మక్క సాగర్‌కు 47, సీతారామ ప్రాజెక్టుకు 67, తమ్మిడిహెట్టికి 20 టీఎంసీలు ఇవ్వాల్సి ఉందన్నారు. కాంగ్రెస్ తెరపైకి తెస్తున్న వార్దా ప్రాజెక్టు పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. తెలంగాణ జలాలను తమిళనాడుకు తరలించే కుట్రలో భాగంగానే ఇచ్చంపల్లిని తెరపైకి తెస్తున్నారని స్పష్టం చేశారు. ఇంత జరుగుతున్నా ఇక్కడి బీజేపీ ఎంపీలు, నాయకులు ఎందుకు నోరుతెరవడం లేదని నిలదీశారు. మేడిగడ్డ వద్ద కాఫర్ డ్యాం నిర్మించాలని బీఆర్ఎస్ చెబుతున్నప్పటికీ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పట్టించుకోలేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చిందని మండిపడ్డారు. నోరు తెరిస్తే ధర్మం గురించి మాట్లాడే కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ గోదావరి జలాల తరలింపును ఏ ధర్మం ప్రకారం సమర్థించుకుంటారని ప్రశ్నించారు. రాష్ట్రంలోని నలుగురు బీజేపీ ఎంపీలు ప్రధానితో మాట్లాడి గోదావరి, కావేరి నదుల అనుసంధానాన్ని రద్దు చేయించాలని కోరారు. ఈ సమావేశంలో నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, మేయర్ వై సునీల్ రావు, మాజీ ఎమ్మెల్సీ భానుప్రసాద్‌రావు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో రూ.20 మీల్స్

హైదరాబాద్, ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ) : ప్రయాణికుల కోసం రైల్వే శాఖ 'ఎ కానమీ మీల్స్'ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ)తో కలిసి ప్యాకెట్-ప్రెండ్లీ క్యాటగిరీ మీల్స్ రూ.20, స్నాక్ మీల్స్ రూ.50కే అందిస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. దేశవ్యాప్తంగా 100కు పైగా రైల్వే స్టేషన్లలో ఎకానమీ మీల్స్‌ను అందుబాటులోకి తీసుకువచ్చిన రైల్వే శాఖ దక్షిణ మధ్య రైల్వే జోన్ ఆధ్వర్యంలో 12 స్టేషన్లలో 23 కౌంటర్ల ద్వారా ఈ భోజనాన్ని అందిస్తున్నదని వెల్లడించారు. వీటిలో హైదరాబాద్, రేణిగుంట, గుంతకల్, తిరుపతి, రాజమండ్రి, వికారాబాద్, పాకాల, ధోన్, నంద్యాల, పూర్ణ స్టేషన్లు ఉన్నాయని అధికారులు పేర్కొన్నారు.

వేసవికి 100 ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్, ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ): వేసవి రద్దీ దృష్ట్యా ప్రయాణికుల కోసం దక్షిణ మధ్య రైల్వే జోన్ ఆధ్వర్యంలో 100 ప్రత్యేక రైళ్లను నడపనున్నారు. వివిధ రైల్వేస్టేషన్ల మధ్య నడిచే ఈ రైళ్ల వివరాలను మంగళవారం రైల్వే అధికారులు వెల్లడించారు. ఈ నెల 28 నుంచి జూలై 30 వరకు ఈ వేసవి ప్రత్యేక రైళ్లు రాకపోకలు కొనసాగిస్తాయని పేర్కొన్నారు. విశాఖపట్నం-చెన్నై, సత్రగాచి-బెంగళూరు, తంబారం-బెరౌని, ఎరోడ్-ధన్‌బాద్, తంబారం-ధన్‌బాద్ తదితర స్టేషన్ల మధ్య వీటిని నడపనున్నట్లు తెలిపారు.

55.73 కోట్ల ఆస్తి ఈడీకి అటాచ్

పీఎంఎల్ఏ కేసులో వీఎంసీ సిస్టమ్స్ ఆస్తులు జప్తు

హైదరాబాద్, ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ): బోగస్ పత్రాలు చూపించి రూ.1,745.45 కోట్లకు పైగా బ్యాంకులను మోసం చేసిన కేసులో హైదరాబాద్‌కు చెందిన వీఎంసీ సిస్టమ్స్ లిమిటెడ్ కేసులో రూ.55.73 కోట్ల స్థిర, చరాస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ జప్తు చేసింది. 2018లో బెంగళూరులో నమోదైన ఈ కేసులో వీఎంసీ సిస్టమ్స్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఉప్పలపాటి హిమబిందును ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు గతంలోనే అరెస్టు చేశారు. పంజాబ్ నేషనల్ బ్యాంకు, ఎస్‌బీఐ, ఆంధ్రా బ్యాంక్, కార్పొరేషన్ బ్యాంక్‌ల కన్సార్షియం నుంచి వీఎంసీ డైరెక్టర్లు భారీ మొత్తంలో రుణాలు తీసుకున్నారు. ఇందుకోసం నకిలీ పత్రాలు సృష్టించారని బ్యాంకులు సీబీఐకి ఫిర్యాదు చేయడంతో ఈడీ అధికారులు దర్యాప్తు ప్రారంభించి, సోదాలు నిర్వహించారు. రూ.692 కోట్ల మేరకు హిమబిందు డమ్మీ లెటర్ ఆఫ్ క్రెడిట్లు సృష్టించినట్టు ఈడీ గుర్తించింది. తాజాగా ఈడీ జప్తు చేసిన ఆస్తుల్లో హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని సతీశ్‌కుమార్ నివాసం, రంగారెడ్డిలోని అనాజ్‌పూర్‌లోని వ్యవసాయ భూమి, అసోంలోని క్యాచర్ జిల్లాలో 580.77 ఎకరాల్లో 11.73 కోట్ల విలువైన ప్రాపర్టీస్, టీ ఎస్టేట్ వంటివి ఉన్నాయి.

శివబాలకృష్ణ అక్రమాస్తుల కేసులో ముగ్గురి అరెస్టు

హైదరాబాద్, ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ): హెచ్‌ఎండీఏ మాజీ డైరెక్టర్ శివబాలకృష్ణ అక్రమాస్తుల కేసులో ఏసీబీ అధికారులు మంగళవారం మరో ముగ్గురిని అరెస్టు చేశారు. వీరిలో గోదావరి సత్యానారాయణమూర్తి (ఏ3), పెంట భరత్‌కుమార్ (ఏ4), పెంట భరణికుమార్ (ఏ5) అనే వ్యాపారులున్నారు. వీరిని కోర్టులో హాజరుపర్చి, జ్యుడిషియల్ రిమాండ్ కోరారు. ఈ ముగ్గురి ద్వారానే శివబాలకృష్ణ తతంగాన్ని నడిపినట్టు ఏసీబీ గుర్తించింది. శివబాలకృష్ణ అక్రమంగా సంపాదించిన సొమ్మును వీరికి చేరవేయగా.. వారు తమ పేరు మీద ఆస్తులు కొనుగోలు చేసేవారు. కొన్నాళ్లకు ఆ ఆస్తులను ఎక్కువ ధరకు అమ్మి వచ్చిన డబ్బును వివిధ దారుల్లో శివబాలకృష్ణకు ఇచ్చేవారని సమాచారం. ఈ ముగ్గురూ భారీగా ఆస్తులను కూడబెట్టినట్టు ఏసీబీ విచారణలో తేలింది.ఈ కేసులో ఇప్పటివరకు గుర్తించిన అక్రమాస్తుల మొత్తం విలువ దాదాపు రూ.250 కోట్లు ఉంటుందని సమాచారం.

అన్నారం బరాజ్‌లో టెస్టింగ్ పనులు

- గేట్ల వద్ద ఉన్న ఇసుక తొలగింపునకు గ్రీన్‌సిగ్నల్
- టీఎస్ఎండీసీ ఆధ్వర్యంలో ప్రక్రియ ప్రారంభం
- తరలించనున్న 6.20 లక్షల క్యూబిక్ మీటర్ల సాండ్
- ఎన్డీఎస్ఏ కోరినా పనులు ప్రారంభించడంలో నిర్లక్ష్యం

అన్నారం బరాజ్‌లో ఎగువన ఉన్న ఇసుకను తరలిస్తున్న దృశ్యం

జయశంకర్ భూపాలపల్లి (నమస్తే తెలంగాణ)/కాళేశ్వరం, ఏప్రిల్ 23: కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన అన్నారం బరాజ్‌లో టెస్టింగ్ పనులకు ఎట్టకేలకు మోక్షం లభించింది. బరాజ్‌లోని గేట్ల వద్ద ఉన్న ఇసుకను తీసి టెస్టింగ్ పనులు నిర్వహించాలని గతంలోనే ఎన్డీఎస్ఏ అధికారులను ఆదేశించింది. అయినా ప్రభుత్వం నుంచి అనుమతి రాకపోవడంతో అధికారులు వెనుకడుగు వేశారు. ప్రస్తుతం అన్నారం బరాజ్‌లోని గేట్ల వద్ద ఉన్న ఇసుకను తరలించేందుకు ప్రభుత్వం అనుమతించడంతో మంగళవారం నుంచి టీఎస్ఎండీసీ ఆధ్వర్యంలో ఇసుక తరలింపు పనులు ప్రారంభమయ్యాయి. బరాజ్ పొడవునా మొత్తం 2.54 కోట్ల క్యూబిక్ మీటర్ల ఇసుక ఉన్నట్టు అధికారులు అంచనా వేయగా, బరాజ్‌లోని గేట్ల వద్ద ఉన్న 6.20 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుకను మాత్రమే తీసేందుకు అనుమతి వచ్చినట్టు అధికారవర్గాల ద్వారా తెలిసింది. ఈ మేరకు టీఎస్ఎండీసీ పనులు ప్రారంభించింది. అన్నారం బరాజ్‌లో ఏర్పడిన చిన్న సీపేజ్‌లకు నిర్మాణ సంస్థ ఆఫ్కాన్స్ జనవరిలోనే ట్రీట్‌మెంట్ పూర్తి చేసింది. బరాజ్‌లోని 38, 28పాటు 35వ ఔట్‌లెట్స్‌లో కనిపించిన సీపేజ్‌లకు పాలి యూరిత్రిన్ కెమికల్‌తో గ్రౌటింగ్ చేసి అరెస్టు చేశారు. 15 రోజులపాటు అబ్జర్వేషన్ పీరియడ్ సైతం పూర్తి చేశారు. ఇన్వెస్టిగేషన్ సంస్థ పార్సన్ పరిశీలన జరిపి తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. అయితే బరాజ్ గేట్ల వద్ద భారీగా ఇసుక ఉండటంతో ఇన్వెస్టిగేషన్ పనులకు ఆటంకం ఏర్పడింది. సీడబ్ల్యూసీ, ఎన్డీఎస్ఏ, రాష్ట్ర డ్యాం సేఫ్టీ బృందాలు సైతం అన్నారం బరాజ్‌ను సందర్శించి సీపేజ్‌లను పరిశీలించాయి. బరాజ్‌లో సీపేజ్‌లను అరికట్టడంలో అధికారులు సక్సెస్ అయ్యారని, అయితే సీపేజ్‌లు ఎందుకు ఏర్పడుతున్నాయి, ఇంకా ఏమైనా లోపాలు ఉన్నాయా.. క్రాక్‌లు ఏర్పడ్డాయా.. లోపాలుంటే చేయాల్సిన పనుల గురించి ఇన్వెస్టిగేషన్ చేయాలని ఎన్డీఎస్ఏ బృందం ఇరిగేషన్ అధికారులకు సూచించింది. ఇందుకోసం బరాజ్‌లోని నీటిని పూర్తిగా వదిలేసి, 250 మీటర్ల ఇసుక తీసి టెస్టింగ్ పనులు చేయాలని కోరింది. అధికారులు ప్రభుత్వ అనుమతి తీసుకుని నీటిని వదిలేశారు. ఇప్పుడు ఇసుక తొలిగింపుకు అనుమతి రావడంతో టీఎస్ఎండీసీ పనులను ప్రారంభించింది. ఇసుకను తీసేందుకు నెల రోజులు పట్టే అవకాశాలున్నాయని అధికారులు తెలిపారు. ఇసుక పూర్తిగా తీసిన వెంటనే పార్సన్ సంస్థ ఇన్వెస్టిగేషన్ పనులను ప్రారంభించనుంది.

ప్రీమాన్‌సూన్ సర్టిఫికెట్ తప్పనిసరి

డ్యాం సేఫ్టీ యాక్టు ప్రకారం ఇరిగేషన్ అధికారులు ప్రీ మాన్‌సూన్, పోస్టు మాన్‌సూన్ సర్టిఫికెట్లను ప్రభుత్వానికి అందించాల్సి ఉన్నది. బరాజ్ ఎగువ ప్రాంతంలో వర్షాకాలం తరువాత టెస్టింగ్‌లు నిర్వహించి పోస్టు మాన్‌సూన్ సర్టిఫికెట్, వర్షాకాలం ముందు టెస్టింగ్ నిర్వహించి ప్రీమాన్‌సూన్ సర్టిఫికెట్‌లను ఇరిగేషన్ అధికారులు ప్రభుత్వానికి అందించాల్సి ఉంది. ఈ సర్టిఫికెట్లను ప్రభుత్వం కేంద్రానికి పంపిస్తుంది.

రామయ్య సేవలో ఖమ్మం ఎంపీ అభ్యర్థి నామా

భద్రాద్రి రామయ్యను దర్శించుకున్న నామా నాగేశ్వరరావు

భద్రాచలం/దమ్మపేట, ఏప్రిల్ 23: బీఆర్ఎస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు భద్రాచలం సీతారామచంద్ర స్వామిని మంగళవారం దర్శించుకున్నారు. బుధవారం నామినేషన్ వేయనున్న నేపథ్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు అర్చకులు, అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. తొలుత ధ్వజస్తంభం వద్ద నమస్కరించుకొని అంతరాలయంలోని మూలవరులకు పూజలు చేసిన ఆయన.. ఆలయ ప్రాంగణంలోని ఉపాలయాలను సందర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు, తాళ్లూరి జీవన్, మోరంపూడి ప్రసాద్, బీఆర్ఎస్ భద్రాచలం నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు రావులపల్లి రాంప్రసాద్, మానె రామకృష్ణ ఉన్నారు.

అభివృద్ధి చేసిన ఘనత కేసీఆర్‌దే..

రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించిన ఘనత కేసీఆర్‌దేనని నామా నాగేశ్వరరావు స్పష్టం చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేటలోని మామిడి తోటలో మంగళవారం ఆ పార్టీ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మొన్నటి శాసనసభ ఎన్నికల్లో మోసపు హామీలతో అధికారంలోకి వచ్చి ప్రజలను పంచిస్తున్న కాంగ్రెస్‌కి.. పార్లమెంటు ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. భద్రాచలం నుంచి కొప్పూరు రైల్వే లైన్‌కు సింగరేణితో రాష్ట్ర వాటా నిధులు ఇప్పించి సత్తుపల్లి వరకు రైల్వేలైన్ పూర్తి చేయడమే అభివృద్ధిపై కేసీఆర్‌కున్న చిత్తశుద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ నాయకులు మట్టి, ఇసుక దందాతో దోచుకునే పనిలో బిజీగా ఉన్నారని, యాసంగిలో పండించిన ధాన్యం కొనే దిక్కులేదని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ప్రజలను దగా చేయడం కాంగ్రెస్ డీఎన్ఏలోనే ఉన్నదని మండిపడ్డారు.

'సన్న' ధాన్యం దళారుల పాలు

- మిల్లర్ల చేతిలో విలవిల్లాడుతున్న అన్నదాతలు
- కనీస మద్దతు ధరకు నోచుకోని కర్షకులు
- వడ్ల కొనుగోలులో సిండికేట్‌గా వ్యాపారులు
- మార్కెట్ ధరలకు పాంతన లేకుండా కొనుగోళ్లు
- చక్రం తిప్పుతున్న రైస్‌మిల్లర్ల సంఘం నేతలు

నిజామాబా